

జయ నగల వేలం... పేదలకు భూములు దానం?

● అవకాశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వం

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన రూ.2,000 కోట్ల నగలు, ఆస్తులు వేలం వేసేందుకు, ఆరు జిల్లాల్లో ఉన్న భూములను పేదలకు దానంగా ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అక్రమార్జన కేసులో మాజీ ముఖ్యమంత్రి జయలలిత వద్ద 27 కిలోల నగలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకొని కోర్టు ఉత్తర్వులు మేరకు కర్ణాటక ప్రభుత్వం శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. ఆరు బాక్స్‌ల్లో నగలు, సూట్‌కేస్‌ల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు భద్రపరచి 40 మంది పోలీసుల భద్రత నడుమ రాష్ట్రానికి తరలించారు. 1991 నుంచి 1996 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలిత ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపణలు వచ్చాయి. 1996వ సంవత్సరం ఆమె ఇంట్లో ఆకస్మికతనిఖీలు నిర్వహించిన అవినీతి నిరోధక విభాగం 27 కిలోల బంగారం, వజ్రాభరణాలు, 700 కిలోల వెండి వస్తువులు, 11,344 చీరలు, 750 పాదరక్షలు, 250 శాలువలు, 91 చేతి గడియారాలు సహా ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకొని ఆమెపై అక్రమార్జన కేసు నమోదుచేశారు. జయలలిత మరణించిన 8 సంవత్సరాల అనంతరం ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న నగలు, ఆస్తి పత్రాలను కర్ణాటక సీబీఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించింది. ఇందులో ఆరు జిల్లాల్లో ఉన్న 1,500 ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసే అవకాశమున్నట్లు తెలిసింది. ఇక, బంగారు నగలు, వజ్రాభరణాలు, చీరలు సహా పలు వస్తువులు వేలం వేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.







తమిళనాడు ప్రభుత్వానికి చేరిన జయలలిత నగలు









స్టాలిన్ ఆగ్రహం

త్రిభాషా విధానం పేరుతో

నిధులు నిలిపేస్తారా?

● తమిళ ప్రజల ఆగ్రహం చవిచూస్తారు ● నిప్పుతో మళ్లీ చెలగాటమా?: ఉదయనిధి
● ఫాసిస్టు ధోరణికి నిదర్శనం : టీవీకే అధినేత విజయ్ ● మళ్లీ హిందీ వ్యతిరేకోద్యమం : వైగో

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానాన్ని అంగీకరించకపోవడం వలనే తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద నిధులు మంజూరు చేయలేమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులనే అడుగుతున్నామేగాని వారి సొంత ఆస్తులను అడగటం లేదని మండిపడ్డారు. త్రిభాషా విధానం ప్రస్తావన రాజ్యాంగంలో ఎక్కడ ఉందో మంత్రి చెప్పగలరా? అంటూ సవాల్ చేశారు. ఇదే విధంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ఎండీఎంకే నేత వైగో, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌తోపాటు తమిళగ వెట్రికళగం నేత విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2152 కోట్ల మేర నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతోందంటూ ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రివర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తామని డీఎంకే ప్రభుత్వం భరోసా ఇస్తూ ఒప్పందంపై సంతకాలు చేయకపోవడం వల్లే నిధులు నిలిపేశారంటూ కేంద్ర పాలకులు చెబుతూ వచ్చారు.

అహంకారానికి నిదర్శనం..

రాష్ట్రానికి విద్యా సంబంధిత నిధులివ్వకుండా ఇబ్బంది పెడుతున్న కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు తన నిజరూపాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ద్వారా వెల్లడించిందంటూ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ పేజీలో ఓ సందేశం విడుదల చేశారు. తమిళనాడు రాజ్యాంగ ధర్మాసనం పరిధిలో రావాలని చెబుతున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆ రాజ్యాంగంలో త్రిభాషా విధానం గురించి ఎక్కడ పేర్కొన్నారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. త్రిభాషా విధానం అమలు చేయకపోతే నిధులివ్వమంటూ కేంద్రం చేస్తున్న ఈ బ్లాక్‌మెయిల్ ధోరణికి తమిళ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్టాలిన్ హెచ్చరించారు.

రాష్ట్ర హక్కులను హరించడమే...

త్రిభాషా విద్యావిధానాన్ని నిర్బంధంగా అమలు చేసేలా కేంద్ర మంత్రి నిధుల్వివమంటూ బహిరంగంగా ప్రకటించడం పాసిస్టు ధోరణకి నిదర్శనమని తమిళగ వెట్రి కళగం నేత, సినీ నటుడు విజయ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ రాష్ట్రం ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉందని తెలిసినా కేంద్ర మంత్రి త్రిభాషా విధానం అమలు చేసి తీరాలంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం గర్హనీయమన్నారు. ఇదే విధంగా ఎండీఎంకే నేత వైగో కేంద్ర విద్యామంత్రి వ్యాఖ్యలు మళ్లీ రాష్ట్రంలో హిందీ వ్యతిరేకోద్యమానికి నాందిపలికేలా ఉన్నాయన్నారు. పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి, అన్నాడీఎంకే సీనియర్ నేత డి. జయకుమార్, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్, డీఎంకే ఎంపీ కనిమొళి వేర్వేరు ప్రకటనలలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.



టీవీకే అధినేత విజయ్

ఇంతకీ మంత్రి ఏమన్నారు?..

కాశీలో శనివారం జరిగిన కాశీ తమిళ్ సంఘం సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళ ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆ సమయంలో సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద తమిళనాడుకు నిధులు నిలిపివేసే అంశాన్ని ప్రస్తావించగా, జాతీయ విద్యావిధానం ప్రకారం ఎన్నో రాష్ట్రాల్లో మాతృభాష, ఆంగ్లభాషతోపాటు మూడో భాషగా హిందీని అంగీరించాయని, అయితే తమిళనాడు ప్రభుత్వం మాత్రం ఈ ప్రతిపాదనను ఎందుకు అంగీకరించటం లేదో అర్థం కావటం లేదని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. నూతన విద్యావిధానం నిబంధనల ప్రకారం మూడోభాషగా హిందీని అంగీకరించాల్సి ఉందన్నారు. అయితే త్రిభాషా విద్యావిధానానినికి తమిళనాడు ప్రభు త్వం అంగీకరించకపోవడం వల్లే ఆ రాష్ట్రానికి నిధులివ్వలేమని స్పష్టం చేశారు. తమిళనాడు పాలకులు రాజకీయ లబ్దికోసమే త్రిభాషా విధానాన్ని అంగీకరించడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్ర విద్యావిధానానికి సంబంధించిన నిబంధనలతో పాటు త్రిభాషా విధానాన్ని కూడా అంగీకరిస్తేనే కేంద్రం నుంచి నిధులు విడుదలవుతాయన్నారు. కేంద్రం ఎప్పుడూ తమిళ భాష చదువకూడదని చెప్పటం లేదని మూడోభాషగా ఒక భాషను అంటే హిందీని అంగీకరించాలని ఒత్తిడి చేయకుండా ప్రతిపాదిస్తున్నామని స్పష్టం చేశారు.



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భిక్షమడగడం లేదు...



విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

సమగ్ర శిక్షా అభియాన్ పథకం నిధులు విడుదల చేయలేమంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన ప్రకటనపై రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ మండిపడ్డారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన ఓ సందేశంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తోందని, రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను మాత్రమే అడుగుతున్నామని బిక్షమడగటం లేదనే విషయాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలన్నారు.

తమిళ ప్రజలను బెదిరిస్తారా?

తమిళ ప్రజలలను హిందీని తృతీయభాషగా అమలు చేయాలని కేంద్ర విద్యామంత్రి బెదిరింపు ధోరణితో చేసిన విమర్శలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఖండించారు. ఈ మేరకు ఎక్స్ పేజీలో విడుదల చేసిన సందేశంలో స్వాతంత్ర్యానంతర రాష్ట్ర చరిత్ర తెలిస్తే తమిళ ప్రజలు ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నారని, హిందీ వ్యతిరేక ఉద్యమాలు జరిగిన విషయం కూడా తెలుస్తుందన్నారు. రాష్ట్రాలకు సమానంగా విద్యానిధులు విడుదల చేయడం వారి కనీస బాధ్యతని అన్నారు. కేంద్ర మంత్రి బెదిరింపు ధోరణి మళ్లీ నిప్పుతో చెలగాటమాడేలా ఉందన్నారు.



ఉప ముఖ్య మంత్రి ఉదయనిధి

2026 ఎన్నికల నాటికి

మెగా కూటమి

● 234 స్థానాల్లో విజయమే అన్నాడీఎంకే లక్ష్యం ● వేలూరు సభలో ఈపీఎస్

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగనున్న ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే ఘనవిజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, ఆ లక్ష్యంతోనే ముందుకెళ్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. అన్నాడీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో 2026 లక్ష్య మహానాడు ఆదివారం సాయంత్రం వేలూరు కోట మైదానంలో జరిగింది. ఈ మహానాడులో పళనిస్వామి మాట్లాడుతూ... రాజధాని నగరం చెన్నైలోని కోటకు వెళ్లాలన్న ఉద్దేశంతోనే ఘనచరిత్ర కలిగిన వేలూరు కోటలో యువత మహానాడు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఒక పార్టీ బలంగా ఉండాలంటే యువత ఎక్కువగా సభ్యులుండాలని గ్రహించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత యువత కోసం పార్టీలో ప్రత్యేక విభాగాన్ని పరిచయం చేశారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పిల్లలు తనను 'నాన్న...నాన్న' అని ఆప్యాయంగా పిలుస్తున్నారని చెప్పుకుంటున్నారని అయితే, అత్యాచారం, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళల పిల్లలు 'నాన్న' అని పిలువడం స్టాలిన్‌కు వినిపించడంలేదా అని ఈపీఎస్ ప్రశ్నించారు. తమిళనాడు ద్విభాషా సిద్ధాంతానికి కట్టుబడి ఉందని, ఇందులో ఎలాంటి మార్పు ఉండబోదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వాన్ని చూడకుండా శ్రామికవర్గాలు, అన్నదాతలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం రాష్ట్రానికి చెందాల్సిన నిధులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కుటుంబ రాజకీయాలు ప్రోత్సహిస్తున్న డీఎంకేది సందర్భవాద రాజకీయమని, మతవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రజలను నమ్మించి 1999లో బీజేపీతో పొత్తు కుదుర్చుకొని కేంద్ర మంత్రివర్గంలో కూడా చోటు దక్కించుకుందని, ఆ తర్వాత కాంగ్రెస్ కూటమితో చేతులు కలిపి ద్వంద్వ వైఖరి ప్రదర్శించిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా అధికారంలోకి వస్తే నీట్ రద్దుచేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్, తన నాలుగేళ్ల పరిపాలనలో ఈ హామీ నెరవేర్చకుండా విద్యార్థులను మోసం చేశారని దుయ్యబట్టారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వ హయాంలో ఎంబీబీఎస్ కోర్సు ఉచితంగా అందించారని, అదే విధంగా క్రీడాకారులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. గతంలో 'గో బ్యాక్ అన్న మోదీ' అన్న స్టాలిన్ ప్రస్తుతం 'వెల్‌కమ్ మోదీ' అని మాట మార్చారని, డీఎంకే మిత్రపక్షాలను నమ్ముకుంటే... అన్నాడీఎంకే ప్రజలను మాత్రమే నమ్ముకొని రాజకీయాల్లో రాణిస్తుందన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలో మెగా కూటమి ఏర్పాటవుతోందని, ఆ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించేలా యువత, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మహానాడులో మాజీ ఎమ్మెల్యే డా.పరమశివం, కేసీ వీరమణి, అప్పు, అగ్రి కృష్ణమూర్తి, డా.తంబిదురై తదితర పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని సత్కరిస్తున్న పార్టీ నేతలు



సభకు హాజరైన యువజన విభాగం కార్యకర్తలు

డీఎంకేలో

సత్యరాజ్ కుమార్తెకు

కీలక పదవి



అడయార్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నటుడు సత్యరాజ్ కుమార్తె దివ్యకు డీఎంకేలో కీలక పదవి లభించింది. దాదాపు నెల రోజుల క్రితం ఆమె డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. ఇంతలోనే ఆమెకు పార్టీలో కీలక పదవి కట్టబెడుతూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి దురైమురుగన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో పేర్కొన్న మేరకు దివ్య సత్యరాజ్‌ను డీఎంకే ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించారు. దీంతో ఆమెకు డీఎంకే నేతలు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తమిళ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుడైన సత్యరాజ్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు సిబి సత్యరాజ్ హీరోగా రాణిస్తుండగా, కుమార్తె దివ్య ప్రముఖ న్యూట్రీషియన్‌గా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో ఆమె ఇటీవల డీఎంకేలో చేరారు. డీఎంకే పార్టీ జెండా రంగు ఎరుపు, నలుపు చీర ధరించి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వం స్వీకరించారు. ఇంతలోనే దివ్య అగ్రనాయకత్వం వద్ద మంచి పేరు సంపాదించి పార్టీ ఐటీ విభాగం సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు.

రౌడీల భరతం పడతాం....

ఆస్తులు జప్తు చేస్తాం!

● డీజీపీ శంకర్ జివాల్ హెచ్చరిక



చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దారి దోపిడీలు, హత్యాయత్నాలకు పాల్పడుతున్న రౌడీలను అణచివేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 26వేలమందికి పైగా రౌడీలున్నట్లు వివరాలను సేకరించామని, వీలైనంత త్వరగా వారిని అరెస్టు చేస్తామని డీజీపీ శంకర్ జివాల్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 91 మంది పేరుమోసిన రౌడీలకు సంబంధించిన ఆస్తులను జప్తు చేశామన్నారని, త్వరలో అక్రమ పద్ధతుల్లో కోట్లాదిరూపాయాల మేర ఆస్తులను కూడబెట్టిన రౌడీలపై చర్యలు తీసుకుని వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యక్తిగత కారణాల వల్లే హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయని, రాజకీయపరమైన కారణాలతొ ఒకటి రెండు హత్యలు మాత్రమే జరుగుతున్నాయన్నారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 1598 హత్యలు జరిగితే గత యేడాది 1489 హత్యలు జరిగాయని, క్రమంగా హత్యల సంఖ్య తగ్గుతున్నట్టు తెలిపారు. ఈ యేడాదిలో హత్యల సంఖ్య మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో దాగిన రౌడీలపై కూడా పోలీసులు తీవ్ర నిఘా వేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం తమ కదలికలపై పోలీసుల నిఘా ఉందని తెలిసే రౌడీలు నేరాలకు పాల్పడడం లేదని, చాలా మంది రౌడీలు ఇంటినుంచి బయటకు రావడం లేదని, దీంతో రౌడీయిజం తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రజలు కూడా రౌడీల కదలికలపై నిఘా వేసి సమీపంలో ఉన్న పోలీసుస్టేషన్లకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తమిళ జాలర్ల

అరెస్ట్‌ను ఖండిస్తూ

రామేశ్వరంలో ధర్నా





ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళుతున్న తమిళ జాలర్లను అరెస్ట్ చేస్తున్న శ్రీలంక నావికాదళం చర్యలను ఖండిస్తూ రామనాథపురం జిల్లా రామేశ్వరంలో ఆదివారం డీఎంకే ఎంపీ కనిమొళి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో జాలర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని కోస్తా జిల్లాల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్తున్న జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తోంది. గత రెండు నెలల వ్యవధిలో 60 మందికి పైగా జాలర్లను అరెస్ట్ చేసి, లక్షల విలువైన మరబోట్లను కూడా శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుంటోంది. జాలర్లను కొన్ని రోజుల తర్వాత విడుదల చేస్తున్నప్పటికీ, వారి పడవలు మాత్రం తిరిగివ్వడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, తమిళ జాలర్ల అరెస్ట్‌ను ఖండిస్తూ రామనాథపురం జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో రామేశ్వరం బస్టాండ్ సమీపంలో ఎంపీ కనిమొళి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.

ఇందులో ముస్లిం లీగ్ ఎంపీ నవాజ్ ఘనీ, ఎమ్మెల్యే ముత్తురామలింగం, జాలర్ల సంఘ ప్రతినిధులు, నిర్వాహకులు, జాలర్ల కుటుంబాలు పెద్దసంఖ్యలో పాల్గొని, తమిళ జాలర్లకు భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంతో పాటు శ్రీలంకకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిరువేర్కాడు పరిధిలో పలు ప్రాంతాల్లో విదుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. జియోసన్ కాలనీ, వానగరం రోడ్డు, జేజే వీధి, రాణి అన్నా నగర్, అశోక్ మియాడోస్, వల్లికొల్లైమేడు, పెరుమాళ్అగరం, సెంచూరియన్, ఆర్వో ఎలైయాష్, వడ నూంబల్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు 'ఎన్ఎంఎంఎస్' పరీక్ష హాల్‌టిక్కెట్ల విడుదల

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు ఈ నెల 22న 'ఎన్ఎంఎంఎస్' పరీక్ష జరుగనుంది. కేంద్ర ప్రభుత్వ జాతీయ రెవెన్యూ, నైపుణ్య అధ్యయన స్కాలర్‌షిప్ పథకం (ఎన్ఎంఎంఎస్) కింద ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ఉపకారవేతనం ఇస్తుంటారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ప్లస్ టూ వరకు నెలకు రూ.1,000 ఉపకారవేతనం అందజేస్తుంటారు. ఈ పరీక్షకు రాష్ట్రంలో 6,695 మంది సహా దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో సోమవారం నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ అధికారులు తెలిపారు.

22 వరకు పొడి వాతావరణం

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 22వ తేది వరకు పొడి వాతావరణం ఉంటుంది. అలాగే, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. ఉదయం వేళల్లో కొన్ని ప్రాంతాల్లో స్వల్పంగా, కొన్ని ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 32-33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 22-23 డిగ్రీల సెల్సియస్‌గా నమోదై ఉదయం వేళల్లో మంచు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

21న తిరువళ్లూర్‌లో ప్రైవేట్ జాబ్ మేళా

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ఈ నెల 21న జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరుగనున్న ఈ కార్యక్రమంలో సుమారు 25కు పైగా సంస్థలు తమకు అవసరమైన పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. టెన్త్, ప్లస్ టూ, ఐటీఐ, డిప్లొమో పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు.

23వేల సింగార చెన్నై ట్రావెల్ కార్డుల పంపిణీ

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంటీసీ బస్సులు, సబర్బన్, మెట్రోరైళ్లలో 'సింగార చెన్నై ట్రావెల్ కార్డు' పరిచయం చేశారు. ఈ కార్డులను గత నెల 6వ తేది నుంచి బ్రాడ్‌వే, సెంట్రల్, తాంబరం, కోయంబేడు, తిరువాన్మియూర్ సహా 20 ప్రాంతాల్లో ఉచితంగా ఇస్తున్నారు. ఈ కార్డులు పొందిన వారు రీ ఛార్జి చేసుకొని, బస్సులు, సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్ల టిక్కెట్లు పొందవచ్చు. ఈ కార్డులు పంపిణీ ప్రారంభించినప్పటి నుంచి శనివారం వరకు 23వేల మంది కార్డులు ఉచితంగా పొందినట్లు అధికారులు తెలిపారు.

21న పాత రేడియోలు, సెల్‌ఫోన్ ఎగ్జిబిషన్

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ అసోసియేషన్, పెరుంబాక్కం గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న పెరుంబాక్కంలో పాత రేడియోలు, సెల్ ఫోన్ల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. 1940లో తయారుచేసిన, ప్రస్తుతం వినియోగంలో ఉన్న సుమారు 1,000కి పైగా ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రదర్శనలోటుంటాయి. ముఖ్యంగా, తొలి టీవీ, కెమెరా, రేడియో, కంప్యూటర్, మొబైల్ ఫోన్, గ్రామ్‌ఫోన్ తదితరాలు ఏర్పాటుకానున్నాయి. ప్రదర్శనలో భాగంగా విద్యార్థులకు ఎలక్ట్రానిక్ పరికరాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు, ఈ ప్రదర్శనను ఉచితంగా వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సోమవారం అదనపు టోకెన్లు అందజేయనున్నారు. శుభ ముహూర్తపు రోజుల్లో ప్రజలు అధికంగా ఆస్తులు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకొంటారు. సోమవారం శుభ ముహూర్తం ఉండడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నారు. ఈ ప్రకారం, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉండే కార్యాలయాల్లో వంద టోకెన్లకు బదులుగా 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లున్న కార్యాలయాల్లో 300 టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు.

ఆంధ్రాలో విస్తరిస్తున్న బర్డ్ ఫ్లూ..

నామక్కల్‌లో ముందస్తు చర్యలు


కోళ్ల ఫారంలో క్రిమినాశిని మందు పిచికారి చేస్తున్న కార్మికుడు

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో, నామక్కల్ ప్రాంతంలోని కోళ్ల ఫారాల్లో వ్యాధి నిరోధక చర్యలు ముమ్మరం చేశారు. ఆంధ్ర రాష్ట్రంలోని గోదావరి, కృష్ణ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి నిర్ధారణ అయింది. ఈ కారణంగా ఆ ప్రాంతాల్లో మూడు నెలలు కోడి మాంసం, కోడి గుడ్ల విక్రయాలకు నిషేధంతో పాటు పలు నిబంధనలు విధించారు. ఈ క్రమంలో, ఆంధ్ర రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతుండడంతో నామక్కల్ జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో యజమానులు ముందస్తు నివారణ చర్యలు చేపట్టారు. నామక్కల్, సేలం, ఈరోడ్ ప్రాంతాల్లో సుమారు వెయ్యికి పైగా కోళ్ల ఫారాలున్నాయి. ఈ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ సోకకుండా కోళ్ల ఫారాల్లో క్రిమినాశిని మందు పిచికారీ చేశారు. అలాగే, వాహనాలపై క్రిమినాశిని మందు పిచికారీ చేసిన తరువాతే లోనికి అనుమతిస్తున్నట్లు కోళ్ల ఫారాల యజమానులు తెలిపారు.

వ్యవసాయ కనెక్షన్లకు 'స్మార్ట్ మీటర్లు'

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు చేసే విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అరికట్టేందుకు, వ్యవసాయ విభాగంలో ప్రతిరోజు ఏ సమయంలో, ఎంత విద్యుత్ వినియోగిస్తున్నారు అనే అంశాలు తెలుసుకొనేలా 'స్మార్ట్ మీటర్లు' ఏర్పాటుచేయాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రంలో వ్యవసాయానికి విద్యుత్ బోర్డు ఉచిత విద్యుత్ అందజేస్తుండగా, ప్రస్తుతం 23.55 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ప్రతిరోజు వ్యవసాయానికి 18 గంటలు, మిగిలిన విభాగాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా అందజేస్తున్నారు. కాగా వ్యవసాయానికి ఏ సమయంలో, ఎంత విద్యుత్ అందజేస్తున్నామనే వివరాలు తెలుసుకోనేందుకు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ మీటర్లు ఏర్పాటుచేయనున్నారు. ఈ స్మార్ట్ మీటర్ల పనితీరుపై 1,500 కనెక్షన్లను ప్రయోగాత్మకంగా పరిశీలించగా, ఈ విధానం సత్ఫలితాన్నిచ్చింది. దీంతో, అన్ని వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించిన విద్యుత్ బోర్డు, త్వరలో టెండర్లు ఆహ్వానించి సంస్థను ఎంపిక చేసి స్మార్ మీటర్ల ఏర్పాటు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

దుబాయ్‌లో నెల్లైకి చెందిన తండ్రీకొడుకుల మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లైకి చెందిన తండ్రీ కొడుకులు దుబాయ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఈత కొలనులో మృతిచెందారు. నెల్లై టౌన్‌కు చెందిన మాధవన్ (48) దుబాయ్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో అధికారిగా పని చేస్తున్నాడు. ఆయన ఒకే కుమారుడు కృష్ణశంకర్ (22) నగరంలో సీఏ చదువుకుంటూ కళాశాల ఇంటర్‌షిప్ కోసం తన మిత్రులతో కలసి ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ తన తండ్రితో వారం రోజులు ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో, ఈనెల 12వ తేది తన తండ్రితో పాటు అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఈత కొలనులో దిగగా నీటమునిగి ఊపిరాడక మృతిచెందారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో దుబాయ్ నుంచి విమానంలో వారి మృతదేహాలు నెల్లైకి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, భర్త, కుమారుడిమరణం తట్టుకోలేక మాధవన్ భార్య కత్తితో పొడుచుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

లిఫ్ట్ నుంచి ఎంపీని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


ఎంపీ విష్ణు ప్రసాద్ - లిఫ్ట్ తెరిచేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో వడలూరు విడిదిగృహానికి వెళ్లిన ఎంపీ విష్ణు ప్రసాద్, అక్కడి పాత లిఫ్ట్‌లో గంట సేపు చిక్కుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది లిఫ్ట్ తలుపులు బద్దలుకొట్టి ఆయనను కాపాడారు. కడలూరు ఎంపీ విష్ణుప్రసాద్, వడలూరులో జరిగిన గ్రామ కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి విడిది గృహానికి వెళ్లి, పార్టీ నేతలతో కలసి రెండో అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. పాతబడిన లిఫ్ట్ హఠాత్తుగా మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో విడిదిగృహం సిబ్బంది, కాంగ్రెస్ నేతలు దిగ్భ్రాంతి చెందారు. విడిది గృహం ఉద్యోగులు, అత్యవసర తాళంతో లిఫ్ట్ తలుపులు తెరిచేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న కురింజిపట్టి, నైవేలీ, కడలూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది, గంట పాటు శ్రమించి, తలుపులు బద్దలుకొట్టి, లిఫ్ట్‌లో ఉన్న ఎంపీ సహా ఇతరులను రక్షించారు. లిఫ్ట్‌లో స్పృహ తప్పిన ఇద్దరు పార్టీ కార్యకర్తలకు ప్రాథమిక చికిత్స చేసి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముగ్గురు వెళ్లే సామర్థ్యం కలిగిన లిఫ్ట్‌లో ఆరుగురు వెళ్లడంతో లిఫ్ట్ ఆగిందని అధికారుల విచారణలో తెలిసింది.

కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంలో ఆగిన ఉత్పత్తి

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంలో తలా 220 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. 2018 జనవరిలో తొలి యూనిట్‌లో సాంకేతిక లోపం కారణంగా ఉత్పత్తి నిలిపివేశారు. ఏడేళ్లు గడిచినా ఆ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ఇక, రెండో యూనిట్‌లో మాత్రమే ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో, ఆ యూనిట్‌లో కూడా సాంకేతిక లోపం తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తిచేసి మార్చి 1వ తేది నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

జలాశయాల్లో 86.23 శాతం నీటినిల్వలు

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీరందించే జలాశయాల్లో 86.23 శాతం నీటి నిల్వలున్నాయి. నగరానికి పూండి, పుళల్, చోళవరం, చెంబరంబాక్కం, కన్నన్‌కోట జలాశయాల నుంచి తాగునీరందిస్తుండగా, ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.757 టీఎంసీలు. ప్రస్తుతం చెంబరంబాక్కంలో 92.04 శాతం, పుళల్‌లో 95.61 శాతం, పూండిలో 93.72 శాతం, చోళవరంలో 12.95 శాతం, కన్నన్‌కోటలో 92 శాతం మొత్తం ఐదు జలాశయాల్లో 10.138 టీఎంసీల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

మేట్టూరులో పెరుగుతున్న నీటిమట్టం

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలోకి వస్తున్న నీటి పరమాణం ఆదివారం 329 ఘనపుటడుగులకు పెరిగిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ డ్యాంలో 110.12 అడుగులున్న నీటిమట్టం 110.09 అడుగులకు తగ్గింది. డ్యాంకు వచ్చే నీరు సెకనుకు 317 ఘనపుటడుగుల నుంచి 329 ఘనపుటడుగులకు పెరిగింది. కాగా, తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి సెకనుకు 500 ఘనపుటడుగుల చొప్పున విడుదల చేస్తున్నారు. డ్యాంలో 78.58 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

టీచర్ల సెలవులపై నిషేధం

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాశాఖ అధికారుల సెలవులపై నిషేధం విధించారు. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 3వ తేదీ, ప్లస్ వన్ పరీక్షలు 5న, టెన్త్ పబ్లిక్ పరీక్షలు 28న ప్రారంభం కానుండగా, మొత్తం 27,57,354 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల కోసం 3,316 కేంద్రాలు ఏర్పాటుచేయగా, పరీక్షల్లో అవకతవకలు జరుగకుండా 13,798 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, పబ్లిక్ పరీక్ష విధుల్లో 1,26,108 మందిని నియమించారు. ఈ నేపథ్యంలో, పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సెలవులు తీసుకోరాదని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సాహస పర్యాటకానికి ప్రోత్సాహకం

- పూండి సహా ఏడు ప్రాంతాల ఎంపిక

అడయార్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రభుత్వం దృష్టిసారించింది. ఆ మేరకు సాహస పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించేందుకు కొత్తగా ఏడు ప్రాంతాలను పర్యాటక శాఖ ఎంపిక చేసింది. వీటిలో తిరువళ్లూరు జిల్లాలోని పూండి, తిరుపత్తూరు జిల్లాలోని ఏలగిరి, కరూర్ జిల్లాలోని పొన్నియారు, ధర్మపురి జిల్లాలోని వత్తలమలై, తిరువణ్ణామలైలో జిల్లాలో జవ్వాదు, తెన్‌కాశిలో ఉన్న గుండారు నామక్కల్‌లోని కొల్లిమలై ప్రాంతాలను ఎంపిక చేశారు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పట్టా కత్తులతో స్వైర విహారం

- నలుగురి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు పట్టా కత్తులతో ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని వ్యాసార్పాడికి చెందిన రంజిత్, కొడుంగయూరుకు చెందిన వర్గీస్ అజిత్, విల్లివాక్కంకు చెందిన పళని, ఇదే ప్రాంతానికి చెందిన 18 యేళ్ళ యువకుడు కూడా ఉన్నాడు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కాశి తమిళ సంగమం...

కోవై నుంచి బయల్దేరిన ప్రత్యేక రైలు

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న 'తమిళ సంగమం 3.0' కార్యక్రమంలో పాల్గొనేందుకు కోవైకు చెందిన 85 మంది ప్రత్యేక రైలులో వెళ్లారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తమిళ సంగమం కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నడుపుతున్న ప్రత్యేక రైళ్లలో ఆధ్యాత్మిక గురువులు, సంగీత విద్వాంసులు, కళాకారులు, హిందూ సంస్థల ప్రతినిధులు వెళ్తున్నారు. ఇందులో భాగంగా కోవై రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం ఉదయం 6.30 గంటలకు బయల్దేరిన కోవై-బెనారస్ ప్రత్యేక రైలులో కోవై, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, నీలగిరి తదితర జిల్లాలకు చెందిన 85 మందికి పైగా బయల్దేరి వెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


ప్రమాదానికి కారణమైన కారు

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తరగతులకు వెళ్లిన ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. శివగంగ జిల్లా కారైక్కుడి సూడామణిపురం ప్రాంతానికి చెందిన రైల్వే ఉద్యోగి చొక్కలింగం కుమారుడు సుదర్శన్ (19) కారైక్కుడిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం పాఠశాలలో జరిగిన ప్రత్యేక తరగతులకు కొత్త బైక్‌లో సుదర్శన్ వెళ్తున్న సమయంలో, కళాశాల సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లాలని నిర్ణయించగా, అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, కారు డ్రైవింగ్ చేస్తున్న కారైక్కుడి అళగప్పపురానికి చెందిన దీపక్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేస్తున్న సెల్వం

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ మహిళా పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ధర్మపురి జిల్లా వెల్లకల్ ప్రాంతానికి చెందిన సెల్వం, సెంబగం దంపతులకు ప్రియాంక అనే కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల వల్ల సెల్వం భార్యాపిల్లలను వదిలిపెట్టి, ఈరోడ్‌లో ఉన్న ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుమార్తె కనిపించలేదన్న సమాచారం తెలుసుకున్న సెల్వం దీనిపై ఫిర్యాదు చేసేందుకు ఈరోడ్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎవరూ ఊహించని విధంగా తన వెంట తీసుకొచ్చిన పెట్రోల్ చల్లుకొని నిప్పంటించుకొనే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. సెల్వంను ఈరోడ్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సీఐ అతడితో మాట్లాడి కుటుంబ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో సెల్వం అక్కడి నుంచి వెళ్లాడు.

వరుసగా ఢీకొన్న నాలుగు కార్లు

- పది మందికి గాయాలు


నుజ్జునుజ్జయిన కార్లు

తిరుత్తణి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపం చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో నాలుగు కార్లు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. ఆంధ్రాకు చెందిన సుష్మిత-సురేష్ తిరుపతిలో వివాహం చేసుకొని తిరుత్తణి ఆలయానికి స్వామి దర్శనం కోసం ఆదివారం బంధువులతో కలసి కారులో వచ్చారు. ఆ సమయంలో రాణిపేట జిల్లా అరక్కోణంకు చెందిన హరి కుటుంబ సభ్యులు వస్తున్న కారును నూతన వధూవరుల కారు ఢీకొంది. అదే సమయంలో తిరుమల దర్శనానికి వెళ్తున్న రమేష్ కారు, దాని వెనుకగా తిరుపతి నుంచి వస్తున్న పెళ్లి బృందం కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో గాయపడిన 10 మందిని చుట్టుపక్కల వారు రక్షించి తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటన కారణంగా సుమారు అరగంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. తిరుత్తణి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బయోగ్యాస్ కర్మాగారంలో బాయిలర్ పేలి ఇంజనీర్ మృతి


శిథిలాలను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మనలి బలిజపాళయం చిన్న సేక్కాడు సమీపంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో నడుపుతున్న బయోగ్యాస్ కర్మాగారంలో శనివారం అర్ధరాత్రి బాయిలర్ పేలి ఓ ఇంజనీర్ మృతి చెందారు. నగరంలోని ఐదు జోన్లలో సేకరించే చెత్తను ఇక్కడి కర్మాగారానికి తరలించి బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కర్మాగారాన్ని ఓ ప్రైవేటు సంస్థ నడుపుతోంది. ఆ కర్మాగారంలో నామక్కల్ జిల్లాకు చెందిన శరవణకుమార్ (25) అనే ఇంజనీర్ పనిచేస్తున్నారు. శనివారం రాత్రి శరవణకుమార్, పొన్నేరికి చెందిన లారీ డ్రైవర్ భాస్కర్ (35) డ్యూటీ ముగియడంతో బయోగ్యాస్ యంత్రాన్ని ఆపారు. ఆ సమయంలో యంత్రంలో ఏర్పడిన ఒత్తిడి కారణంగా బయోగ్యాస్ బాయిలర్ ఉన్నట్టుండి పేలింది. ఆ పేలుడుకు అక్కడి గది గోడలు కూలిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ఇంజనీర్ శరవణన్, డ్రైవర్ భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చూసి కర్మాగారానికి కాస్త దూరంలో ఉన్న కార్మికులు అక్కడికి చేరుకుని శిథిలాల మధ్య ఉన్న డ్రైవర్ భాస్కర్‌ను వెలికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇంజనీర్ శరవణన్‌పై శిథిలాల పెద్దవిగా ఉండటంతో వాటిని తొలగించేందుకు వీలుకాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు రెండు గంటల పాటు పోరాడి ఆదివారం వేకువజామున శరవణన్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ బాయిలర్ పేలుడు శబ్దానికి ఆ కర్మాగారం సమీపంలో ఇళ్లలో నివసిస్తున్నవారంతా భీతిల్లారు. ఏదో బాంబు పేలిందనుకుని ఇళ్ల నుండి భయంతో బయటకు పరుగులు తీశారు. చివరకు పోలీసులు బాయిలర్ పేలినట్లు తెలుపటంతో అందరూ ఇళ్లకు వెళ్ళారు.ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- యజమానికి నగల అప్పగింత


నగలు అందజేస్తున్న ఆటో డ్రైవర్ శరవణన్

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): ఆటోలో మరచిన 40 సవర్ల నగలతో ఉన్న బ్యాగును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన డ్రైవర్‌ను పలువురు అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన నితీష్ నగరానికి వచ్చి ఆటోలో ప్రయాణించాడు. ఆ సమయంలో తన బ్యాగును ఆటోలో మరచిపోయాడు. బ్యాగు గమనించిన ఆటో డ్రైవర్ శరవణన్, అందులో విలువైన 40 సవర్ల నగలు, ట్యాబ్లెట్ ఉండడం గమనించి వెంటనే అన్నానగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. దీనిపై పోలీసులు విచారించి నితీష్‌కు సమాచారం ఇచ్చారు. అన్నానగర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు, నగలు, టాబ్లెట్ అప్పగించారు. ఆటో డ్రైవర్ శరవణన్ నిజాయితీని పోలీసు అధికారులు, నితీష్ అభినందించారు.

బాలికలకు లైంగిక వేధింపులు

- నలుగురు బాలుర అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు బాలురను పోలీసులు అరెస్ట్ చేశారు. కోవై జిల్లా పొల్లాచ్చి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు ప్రభుత్వ పాఠశాలో చదువుతున్నారు. అదే గ్రామానికి చెందిన 13 నుంచి 16 ఏళ్లలోపున్న నలుగురు బాలురు, ఇద్దరు బాలికలకు బంధువులని సమాచారం. వీరు కొద్దిరోజుల క్రితం ఇద్దరు బాలికలను వేరే ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. వారి వేధింపులు తట్టుకోలేని బాలికలు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు '1098'కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు, పొల్లాచ్చి మహిళా పోలీసులు విచారణ చేపట్టారు. నలుగురు బాలురు పాఠశాలకు సక్రమంగా వెళ్లడం లేదని, గతంలో జరిగిన అర్థ వార్షిక పరీక్షల సమయంలో ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఉత్తర్వులతో కోవై జువైనల్ హోంకు తరలించారు.

ప్రైవేటుగా విద్యుత్ కొంటారా...?

- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం సబబుకాదని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... రానున్న వేసవి సీజన్‌లో విద్యుత్ అవసరాలు పెరిగే అవకాశముందని, అందుకు తగ్గట్టుగా ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేశారని, దీనికి టీఎన్ఈబీ క్రమబద్ధీకరణ కమిషన్ నుంచి అనుమతి పొందలేదని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలను పెంచే సమయంలో తమ చేతుల్లో ఏమి లేదని చెబుతున్న టీఎన్ఈబీకి ఈ అధికారం ఎవరిచ్చారని ఆయన వ్యాఖ్యానించారు.

అన్నామలై చెప్పేవి జరగదు

- మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరుగబోయే ఎన్నికల్లో కమలం వికసిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాట్లాడేది జరుగబోదని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్ తొలగించి ఆ స్థలంలో వాణిజ్య కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఈ బస్‌స్టేషన్‌ను ఎప్పటికీ తొలగించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదన్నారు. తిరుచ్చి బర్డ్స్ పార్క్ ప్రవేశ రుసుము తగ్గించడంపై జిల్లా కలెక్టర్ నిర్ణయిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని, ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కూడా తమిళనాడు అన్న పదం లేదన్నారు. రాష్ట్రంలో త్రిభాషా విధానానికి తాము వ్యతిరేకులమని, అందువల్లే కేంద్ర ప్రభుత్వం నిధులు పంపిణీ చేయడం లేదని మంత్రి అన్నారు.

హోటల్ యజమానిపై దాడి.. ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి సమీపంలో ఓ హోటల్ యజమానిపై దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెంబరంబాక్కం ప్రాంతంలో ఇళవరసు నడుపుతున్న హోటల్‌కు మద్యం మత్తులో వెళ్లిన ముగ్గురు యువకులు, మామూలు ఇవ్వాలని గొడవకు దిగి ఇళవరసును కత్తితో గాయపరచి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, నాసరత్‌పేట ప్రాంతానికి చెందిన శశికుమార్, మణికంఠన్, విల్లివాక్కంకు చెందిన ముత్తుకుమార్ లను అరెస్ట్ చేశారు. వీరిని శుక్రవారం పూందమల్లి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు.

సీపీఎం మహాసభల ప్రాంగణం పరిశీలన


మహాసభ జరిగే ఆడిటోరియంను పరిశీలిస్తున్న ప్రకాష్ కారత్

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం 24వ జాతీయ మహాసభలు ఏప్రిల్ 2 నుంచి 6వ తేది వరకు మదురైలో జరుగనున్నాయి. మహాసభల ఏర్పాట్లను ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమన్వయకర్త ప్రకాష్ కారత్ శనివారం పరిశీలించారు. మహానాలు జరిగే తుముక్కం ఆడిటోరియంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మదురైలో నిర్వహించనున్న ప్రదర్శనలో లక్షలాది మంది కార్యకర్తలు పాల్గొనున్నారని, ఈ మహాసభలో ప్రస్తుత రాజకీయాలపై పలు తీర్మానాలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీ ఎస్.వెంకటేశన్, మదుకూర్ రామలింగం, కె.సామువేల్‌రాజ్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

వేలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ జెండాలు తొలగిస్తున్న కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. రాణిపేట జిల్లా షోలింగర్ సమీపం పాణవరం జంక్షన్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో డీఎంకే నాయకుడికి చెందిన శుభకార్యం జరిగింది. దానికి మంత్రి గాంధీ, ఎంపీ జగద్రక్షకన్‌ను ఆహ్వానిస్తూ దారిపొడవునా జెండాలు, ప్లకార్డులు ఏర్పాటుచేశారు. వేడుక పూర్తియిన అనంతరం నెమిలి తాలూకా చినపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ (48) జెండాలు తొలగిస్తున్న సమయంలో, హఠాత్తుగా జెండా స్తంభం విద్యుత్ తీగను తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై షోలింగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బీజేపీ నేత అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడిన బీజేపీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఎంకేబీ నగర్‌లో కేంద్ర బడ్జెట్‌లోని అంశాలను ప్రజలకు వివరించే బహిరంగ సభ ఈ నెల 13వ తేదీ జరిగింది. ఇందులో బీజేపీనేత కన్నన్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కించపరిచేలా వ్యక్తిగత దూషణలు చేశారు. ఆయన ప్రసంగం వివాదాం కావడంతో ఎంకేబీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలియగానే కన్నన్ నగరం విడిచి పారిపోయాడు. అతడి కోసం ప్రత్యేక పోలీస్ బృందం గాలింపు చర్యలు చేపట్టగా, నెల్లైలో ఉన్నట్టు గుర్తించి, అక్కడకు వెళ్ళి అరెస్టు చేశారు.

తమిళ చిత్రజ్యోతి



ఎలాంటి ప్రమాదం జరగలేదు క్షేమంగా ఉన్నాను : యోగిబాబు

కారు ప్రమాదానికి గురై తాను గాయపడినట్టుగా వచ్చిన వార్తపై ప్రముఖ నటుడు యోగిబాబు స్పందించారు. తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, తాను క్షేమంగా ఉన్నట్టు ఓ ఆడియో రికార్డు చేసి ఆయన వ్యక్తిగత పీఆర్వో ద్వారా మీడియాకు విడుదల చేశారు. తమిళ చిత్రసీమలో ప్రముఖ హాస్య నటుడిగా బిజీగా ఉన్న యోగిబాబు ఒక వైపు పలువురు అగ్రహీరోల చిత్రాల్లో హాస్య పాత్రలు చేస్తూనే మరోవైపు వరుస చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కారుకు ప్రమాదమైనట్టు ఆదివారం ఉదయం మీడియాలో వార్తాకథనాలు ప్రసారమయ్యాయి. ఈ ప్రమాదంలో యోగిబాబు మాత్రం ఎలాంటి గాయాలు లేకుండా ప్రాణాలతో బయట పడ్డారని, ఆయన సహాయకుడు మాత్రం గాయాలపాలైనట్టు వార్తలు వచ్చాయి. ఇవి వైరల్ కావడంతో యోగిబాబు స్పందించారు. 'నాకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. నేను బాగానే ఉన్నాను. ప్రస్తుతం ఓ సినిమా షూటింగులో బిజీగా ఉన్నాను. షూటింగ్ కోసం వచ్చిన కారు ప్రమాదానికిగురైంది. అయితే, ఆ కారులో నేను, నా వ్యక్తిగత సహాయకుడు ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఇందులో ఏమాత్రం నిజం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాను. నా స్నేహితులు, సినీ ప్రముఖులు, అభిమానులు, జర్నలిస్టులు ఇలా చాలా మంది నన్ను సంప్రదించి యోగక్షేమాలు అడుగుతున్నారు. వారందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.

కవిన్ - ప్రీతి అస్రానీ 'కిస్'

కవిన్ - ప్రీతి అస్రానీ జంటగా నటించిన తాజా చిత్రం 'కిస్'. ప్రముఖ కొరియాగ్రాఫర్ సతీష్ ఈ మూవీ ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇతర పాత్రల్లో వీటీవీ గణేష్ తదితరులు నటించారు. వేసవిలో సందడి చేయడానికి సిద్ధమవుతున్న ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ టీజర్‌ను పరిశీలిస్తే, 'ప్రేమ నుంచి పారిపోయిన ఒక యువకుడు తిరిగి ప్రేమలో ఎలా పడ్డారన్నదే ఈ చిత్ర కథ. ప్రేమికుల ముద్దుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, 'యాంటీ వాలెంటైన్స్' అంటూ టీజర్‌లో చూపించారు. ఇందులో డైలాగులు పెద్దగా లేకపోయినప్పటికీ రొమాన్స్, కామెడీ ఆధారంగా ఈ మూవీని రూపొందించినట్టుగా తెలుస్తుంది.

'కిస్'లో కవిన్, ప్రీతి అస్రానీ



పూర్తి పారితోషికం ఇవ్వడం చాలా అరుదు : ఎస్కే



కమల్ హాసన్ - శివకార్తికేయన్

చిత్రపరిశ్రమలో పూర్తి పారితోషికం ఇవ్వడం చాలా అరుదైన విషయమని హీరో శివకార్తికేయన్ అన్నారు. కమల్ హాసన్ నిర్మాతగా, రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా రూపొందిన చిత్రం 'అమరన్'. ఈ చిత్రం విడుదలై వంద రోజులను విజయవంతంగా పూర్తి చేసుకుంది. దీంతో శతదినోత్సవ ఫంక్షన్‌ను తాజాగా నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నటించినందుకు నాకు పారితోషికం పూర్తిగా ఇచ్చారు. నేటి కాలంలో ఇది అరుదైన ఘటన. ఇక్కడ ఉన్న సినీ నిర్మాత, ప్రముఖ ఫైనాన్షియర్ అన్బు చెళియన్‌కు ఈ విషయం బాగా తెలుసు. నా చిత్రాల విడుదలకు ముందు రోజు అన్బుచెళియన్ కార్యాయంలోనే ఉండేవాడిని. చాలా మంది పారితోషికం ఇవ్వరు. కొందరు సగం తీసుకుని వెళ్ళిపోతారు. ఈ విషయం చిత్రపరిశ్రమలోని రెండు మూడు గ్రూపులకు బాగా తెలుసు. ఇలాంటివన్నీ దాటుకుని మీరు(కమల్) ఇక్కడకు వచ్చారు. కానీ, ఇపుడు నాకు ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సినిమా విడుదలకు ఆరు నెలల ముందే పూర్తి పారితోషికాన్ని అందజేశారు. దానికంటే ఎంతో గౌరవ మర్యాదలిచ్చారు.ఇలాంటి ఒక నిర్మాణ సంస్థను చూడటం అరుదు'అని శివకార్తికేయన్ కొనియాడారు.. ఈ కార్యక్రమంలో అగ్రనటుడు కమల్ హాసన్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌లో గాయపడిన జనని



లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'లియో' చిత్రంలో ఓ చిన్న పాత్రలో నటించిన 'బిగ్‌బాస్' ఫేం జనని షూటింగులో గాయపడ్డారు. బిగ్‌బాస్ సీజన్-6, కుక్ విత్ కోమాలి వంటి పోటీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీలంక పౌరురాలు జనని... 'ఉసురే' అనే చిత్రంలోనూ మంచి పాత్రలో కనిపించారు. ఇపుడు 'నిళల్' అనే చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో ఆర్యన్ అనే సీరియల్ నటుడు హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో ఆమె గాయపడ్డారు. దీంతో వైద్యుల సూచన మేరకు కాలికి కట్టుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియోను ఆమె తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు.

అళగుమలైలో కోలాహలంగా జల్లికట్టు పోటీలు



ఎద్దును అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



పోటీల సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా అళగుమలై జల్లికట్టు ఎద్దుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ పోటీలను తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎం.స్వామినాథన్ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులు, ఎద్దుల యజమానులు, నిర్వాహకులతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.క్రిస్తు రాజ్, రెవెన్యూ అధికారి కె.కార్తికేయన్ సహా పలువురు అధికారులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 800 ఎద్దులు పాల్గొనగా, వాటిని అదుపుచేసేందుకు 500 క్రీడాకారులు బరిలో నిలిచారు. ఈ పోటీకి ముందు ఎద్దులు, క్రీడాకారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నమోదుచేసిన నెంబర్ల ఆధారంగా ఎద్దులు, క్రీడాకారులను విడతల వారీగా అనుమతించారు. ఈ పోటీల్లో అధికంగా ఎద్దులు అదుపుచేసిన క్రీడాకారులు, క్రీడాకారులకు అందకుండా పరుగులు తీసిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందించారు

దిండుగల్ జిల్లాలో...

దిండుగల్ జిల్లా సానార్‌పట్టి సెయింట్ ఆంతోని ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దిండుగల్, తేని, మదురై, విరుదునగర్, శివగంగ, తిరుప్పూర్ జిల్లాలకు చెందిన 725 ఎద్దులు పాల్గొనగా, 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎద్దులు దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా జల్లికట్టు పోటీలు తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



పోటీలు వీక్షిస్తున్న ప్రజలు

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు



తిరుచెందూరు ఆలయ ప్రాంగణం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ కొలువైన తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయానికి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో సముద్రతీరం వద్ద, నాళికినరు వద్ద భక్తులు రద్దీ విపరీతంగా పెరిగింది. తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల నుండి కూడా భక్తులు తరలివచ్చారు. దీనితో సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్ళి స్వామివారిని దర్శించుకునేందుకు నాలుగు గంటలు పట్టింది.

కొలపాక్కంలో పికిలెర్స్‌బాల్ స్పోర్ట్స్ స్టేడియం



చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ డెన్ అనుబంధ సంస్థ 'పికిలెర్స్ బాల్' నగరంలో పల్లావరం రోడ్డులో ఉన్న కొలపాక్కంలో తన మూడో పికిలెర్స్ బాల్ స్పోర్ట్స్ స్టేడియం ప్రారంభించిందని ఆ సంస్థ అధినేత సూరజ్ విశ్వనాథన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూడీ నిర్మాణ సంస్థ డైరెక్టర్ డబ్ల్యూఎస్ హబీబ్, ఇండియం సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు రామ్‌కుమార్, సాయి కింగ్స్ నిర్వాహకుడు బాలాజీ శఠగోపన్, క్రీడాకారుడు నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

పబ్లిక్ పరీక్ష రాసే విద్యార్థులకు శక్తి అమ్మ ఆశీస్సులు



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న శక్తి అమ్మ

వేలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపురం నారాయణి స్వర్ణాలయంలో టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల రాసే విద్యార్థులను శక్తి అమ్మ ఆశీర్వదించారు. స్వర్ణాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో శక్తి అమ్మ సమావేశమయ్యారు. ముందుగా శక్తి అమ్మ ఆధ్వర్యంలో సరస్వతి యాగం, కలశంలో పవిత్ర జలాలు ఉంచి వేద మంత్రాలు పఠించారు. పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆశీర్వదించిన శక్తి అమ్మ, విద్యార్థులకు పెన్నులు అందించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఫోర్స్ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ పొన్ని, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి సహా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో డిజిటల్ లాకర్ సదుపాయం



రెండో ప్లాట్‌ఫారం సమీపంలో ఏర్పాటుచేసిన డిజిటల్ లాకర్ ప్రాంగణం

పెరంబూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు తమ లగేజీ భద్రపరచుకొనేలా చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో డిజిటల్ లాకర్ సదుపాయం కల్పించారు. ఈ రైల్వేస్టేషన్‌కు ప్రతిరోజు సుమారు 2 లక్షల మంది వరకు వస్తుంటారు. నగరానికి వచ్చే పర్యాటకులు, వ్యాపారం, ఆసుపత్రులకు వచ్చే వారు తమ లగేజీ భద్రపరచుకొనేందుకు ఇబ్బంది పడుతుంటారు. వారి సౌకర్యార్థం సన్ మోటార్ బాక్స్ అనే సంస్థతో దక్షిణ రైల్వే స్మార్ట్ లగేజ్ లాకర్స్ ఏర్పాటుకు మూడేళ్ల ఒప్పందం చేసుకుంది. మీడియం, లార్జ్, బిగ్ లార్జ్ ఇలా మూడు రకాలుగా 84 లాకర్స్ ఏర్పాటయ్యాయి.

రుసుము వివరాలు...

మీడియం లాకర్ బాక్స్‌కు మూడు గంటల సమయానికి రూ.40, ఆరు గంటలకు రూ.60, 9 గంటలకు రూ.90, ఒక రోజుకు రూ.120 వసూలు చేస్తున్నారు.లార్జ్ లాకర్ బాక్స్‌కు మూడు గంటలకు రూ.50, ఆరు గంటలకు రూ.80, 9 గంటలకు రూ.120, ఒక రోజుకు రూ.160గా నిర్ణయించారు. బిగ్ లార్జ్ బాక్స్‌కు మూడు గంటలకు రూ.60, ఆరు గంటలకు రూ.100, 9 గంటలకు రూ.150, ఒక రోజుకు రూ.200 రుసుము నిర్ణయించారు.

స్మార్ట్ ఫోన్ ద్వారా...

ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... డిజిటల్ లాక్ బాక్స్ పూర్తిగా స్మార్ట్ ఫోన్ ద్వారా పనిచేస్తుందన్నారు. ప్రయాణికులు తమ లగేజీ లాకర్ బాక్స్‌లో ఉంచాలంటే, తన సెల్‌ఫోన్‌లో డిజిటల్ లాకర్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. అనంతరం లాకర్ ఎంపిక చేసుకొని, జీపే ద్వారా రుసుము చెల్లించాలి. వెంటనే, లాకర్ నెంబరుతో రహస్య నెంబరు వస్తుంది. ఈ నెంబరు ఉపయోగించి లాకర్‌లో లగేజీ ఉంచి వెళ్లవచ్చు. ఎంత సమయం లాకర్ వినియోగించుకుంటున్నామో ప్రయాణికుల సెల్‌ఫోన్‌కు సమాచారం వెళ్తుంది. అగ్ని ప్రమాదాలు సంభవించే వస్తువులు లాకర్‌లో ఉంచేందుకు అనుమతి లేదని అధికారులు తెలిపారు.

తిరుమలకు 1,008 మంది భక్తుల పాదయాత్ర

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ కందపిళ్లై వీధిలోని శివా విష్ణు సేవార్థిగళ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 44వ వార్షిక తిరుమల పాదయాత్ర ఆదివారం మొదలైంది. మాలాధారణ చేసి 40 రోజులు దీక్షలో ఉన్న సుమారు 1,008 మందికి పైగా భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉత్సవమూర్తులకు గురుస్వామి భక్తవత్సలం ఆదివారం ఉదయం అభిషేక పూజలు నిర్వహించారు. పాదయాత్ర సాగే మార్గంలో ఉన్న ఆలయాలను దర్శించి ఈ నెల 20న తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆళ్వార్ ప్రబంధ ప్రవచనకర్త చిత్తూరు వాసుదేవన్, జాగు హోటల్స్ అధినేత డి.జంబులు విశేష పూజల అనంతరం ఈ పాదయాత్రను ప్రారంభించారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ పొన్నూరు వేంకటకృష్ణారావు పర్యవేక్షణలో తిరుమలకు పాదయాత్ర భక్తుల గోవింద నామస్మరణతో బయల్దేరింది.



పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

ఘనంగా మురుగన్ కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుత్తణి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి ఆలయంలో ఆదివారం సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా యాగశాల పూజ, అనంతరం కల్యాణం నిర్వహించారు. ఆలయానికి కావళ్లతో వచ్చిన భక్తులు, క్యూలైన్‌లో వేచి స్వామి దర్శనం చేసుకున్నారు.

విశ్రాంతి మహిళా మండలి సేవలు ప్రశంసనీయం

● రచయిత్రి జలంధర



వేడుకల్లో ప్రముఖులు, నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితతో పాటు సమాజానికి విశ్రాంతి మహిళా మండలి, సాధన మహిళా మండలి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత్రి జలంధర కొనియాడారు. మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా మండలి వేదికగా విశ్రాంతి మహిళా మండలి 35 సంవత్సరాల వేడుక, సాధన మహిళా మండలి సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళా మండలి అధ్యక్షురాలు వీఎల్ లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎన్.అరుణ సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలకు అతిథులుగా సినీ నటుడు దివంగత చంద్రమోహన్ సతీమణి, రచయిత్రి జలంధర, ప్రముఖ నేపథ్యగాయని గోపికా పూర్ణిమ, ఆంధ్ర బాలానందం పాఠశాల ప్రిన్సిపాల్ డి.పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవలతో పాటు మహిళల అభ్యున్నతి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ మండళ్లు చేస్తున్న కృషిని వారు వేడుకల్లో భాగంగా జలంధర, రాజేశ్వరి సహా 50 మంది సభ్యులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

కొడైకెనాల్‌లో పర్యాటకుల రద్దీ

చెన్నై, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో సంక్రాంతి తర్వాత పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్నట్టుండి గత మూడు రోజుల నుంచి విపరీతంగా పెరిగింది. వారాంతపు సెలవుదినాలు కావటంతో శనివారం ఉదయం నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పైన్ ఫారెస్ట్ ట్రీ ఏరియా, మోయర్ స్క్వేయర్, గుణా గుహ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండే పర్యాటకు సందడి అధికమైంది. సరస్సులో బోట్‌సవారీకి పర్యాటకులు బారులు తీరారు. కొడైకెనాల్ ప్రధాన పర్వతానికి చేరువగా ఉన్న మన్నవనూర్, పూండి, కిలావరై, పూంపారై, ఎలుమ్‌పల్లం, మొసళ్లపార్కు ప్రాంతాల్లో పర్యాటకులు సందర్శించారు. హఠాత్తుగా పర్యాటకులు పెరగడంతో అమ్మకాలు కూడా పెరిగాయని హోటళ్ల యజమానలు తలిపారు.



కొడైకెనాల్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

శ్రీవారి సేవలో సూపర్‌స్టార్ కుమార్తె

తిరుమల, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య, ఆమె కుమారుడు లింగ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



కుమారుడితో ఐశ్వర్య

సమాజ సేవ కోసం కృషిచేద్దాం

● వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు

ప్యారీస్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం కృషిచేయాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ చారుగొండ్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అన్నానగర్ శాంతి కాలనీలో ఆదివారం వాసవి క్లబ్ మైటీ అన్నానగర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథి సీహెచ్ వెంకటేశ్వరరావు సమక్షంలో వాసవి క్లబ్‌ల జిల్లా గవర్నర్ చంద్రగిరి రాజేష్ కొత్తగా ఎంపికైన నిర్వాహకులు యామిని శ్రీధర్ (అధ్యక్షులు), ఎస్.వాణి (కార్యదర్శి), సిశైలజ (కోశాధికారి)తో ప్రమాణ స్వీకారం చేయించారు. క్యాబినెట్ సెక్రటరీ బి.అనంత పద్మనాభన్, ట్రెజరర్ ఆర్వీఎల్ రత్నకుమార్, రీజియన్ చైర్‌పర్సన్ ఎస్వీ పద్మనాభన్, జోన్ చైర్‌పర్సన్ ఎల్. శ్రీధర్ గుప్తా, రీజియన్ సెక్రటరీ ఎస్.వనిత తదితర ప్రముఖులు, సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



వాసవి క్లబ్ మైటీ అన్నా నగర్ నూతన కార్యవర్గంతో వెంకటేశ్వరరావు, చంద్రగిరి రాజేష్ తదితరులు